# ***తెలంగాణ రాష్ట్ర కేబినెట్ తీర్మానాలు***

తేది: 17 జులై 2014

1. 1969 నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలను ఆదుకోవడం తెలంగాణ ప్రభుత్వ బాధ్యత. అందుకే తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కుటుంబ సభ్యుల్లో ఒకరికి అర్హతను బట్టి ఉద్యోగావకాశం, కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం, గృహ వసతి, అమరవీరుల పిల్లలకు ఉచితవ విద్య అందించాలని, వ్యవసాయాధారిత కుటుంబాలైతే మూడు ఎకరాల భూమి ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది.
2. లక్ష రూపాయల వరకు రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బంగారంపై తీసుకున్న వ్యవసాయ రుణాలను కూడా రద్దు చేయాలని నిర్ణయం తీసుకుంది. రుణమాఫీ పథకం వల్ల 39, 07, 409 మందికి రుణవిముక్తి కలుగుతుంది. ప్రభుత్వంపై 17 నుంచి 19 వేల కోట్ల రూపాయల భారం పడుతుంది.

3. వృద్ధులు, వితంతువులకు రూ.1000, వికలాంగులకు రూ.1500 వరకు పెన్షన్ పెంచాలని, దీన్ని ఈ ఏడాది దసరా-దీపావళి పండుగల మధ్య అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీడీ కార్మికులకు కూడా నెలకు రూ.1000 చొప్పున జీవన భృతి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తెలంగాణలో ఎంత మంది బీడీ కార్మికులున్నారో సరిగ్గా లెక్క తేల్చేందుకు ప్రభుత్వం కార్మికశాఖను ఆదేశించింది. ఆ లెక్క తేలిన తర్వాత ఈ పథకం అమలవుతుంది.

4. కళ్యాణలక్ష్మి అనే కొత్త పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా దళిత, గిరిజన ఆడపిల్లల పెండ్లి సందర్భంగా ప్రభుత్వం రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుంది.

5. 2001 నుంచి తెలంగాణ రాష్ట్రం వచ్చే వరకు జరిగిన పోరాటంలో ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకుంటూ మంత్రివర్గం తీర్మానం చేసింది.

6. ఆటోరిక్షాలు, ట్రాక్టర్లు, ట్రాలీలపై రవాణాపన్ను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 5,17,000 మంది దీనివల్ల లాభం పొందుతారు. ప్రభుత్వంపై రూ. 56 కోట్ల రూపాయల భారం

పడుతుంది. రూ. 76 కోట్ల పాత బకాయిలు రద్దు చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది.

7. 500 జనాభా కలిగిన గిరిజన తండాలు, ఆదివాసీ గూడేలను ప్రత్యేక గ్రామ పంచాయితీలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

8. తెలంగాణ రాష్ట్రంలో ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

9. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, అవసరమైతే వయసు సడలింపులు కూడా ఇవ్వాలని, తెలంగాణ కాంట్రాక్టు ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

10. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ స్థాయిలో జీతాలు చెల్లించాలని, తెలంగాణ స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

11. వ్యవసాయాధారిత దళిత కుటుంబాలకు మూడు ఎకరాల చొప్పున భూమి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

12. ఎస్టీలకు, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు ఉండాలన్నది తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం. అయితే ఈ విధానం

అమలులో సాధ్యాసాధ్యాలను, న్యాయపరమైన అంశాలను పరిశీలించేందుకు సిట్టింగ్ లేదా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో కమిటీ వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

13. వక్ఫ్ బోర్డుకు జ్యుడిషియల్ అధికారాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెషన్స్ జడ్జిని నియమించి, అధికారాలు అప్పగించనుంది.

14. తెలంగాణ ఎన్ఆర్ఐలు ముఖ్యంగా గల్ఫ్ లో ఉన్న వారిని ఆదుకోవడానికి, అవసరమైన సాయం చేయడానికి కేరళ తరహాలో ప్రత్యేక ఎన్ఆర్ఐ సెల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

15. తెలంగాణ విద్యార్థులకు ఆర్థికసాయం చేయడానికి ఫైనాన్షియల్ అసిస్టెన్స్ ఫర్ స్టూడెండ్స్ ఆఫ్ తెలంగాణ (ఫాస్ట్) పథకాన్ని తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1956 నవంబర్ 1కి ముందు తెలంగాణలో ఉన్న కుటుంబాలకు ఈ పథకం ద్వారా సాయం అందుతుంది.

16. జంట నగరాల్లో కల్లు దుకాణాలను ఈ ఏడాది దసరా నుంచి పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

17. బతుకమ్మ, బోనాలు పండుగలకు స్టేట్ ఫెస్టివల్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

18. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

19. పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశ పెట్టాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలను తయారు చేయాల్సిందిగా పరిశ్రమల శాఖను ఆదేశించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

20. హైదరాబాద్ ను విశ్వనగరంగా మార్చేందుకు అవసరమైన మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ, అంతర్జాతీయ కన్సెల్టెన్సీలను నియమించుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి మున్సిపల్ శాఖకు అనుమతి ఇచ్చింది.

21. రాష్ట్ర స్థాయిలో సలహామండలిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మండలిలో వివిధ రంగాల్లో నిపుణులు, మేధావులు, స్వచ్ఛంద సేవకులు, పాత్రికేయులు సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర స్థాయి మండలి మాదిరిగానే జిల్లా స్థాయిలో కూడా సలహా మండలి నియమించే ఆలోచన ప్రభుత్వానికుంది.

22. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ చిహ్నంలో మార్పులు చేయాలని, సింహాల బొమ్మ కిందనే సత్యమేవజయతే అనే పదం వచ్చే విధంగా మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

23. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

24. ముస్లిం, మైనారిటీ కార్పొరేషన్ కు రూ.1000 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది.

25. తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

26. మైనారిటీల ఆర్థిక, సామాజిక ప్రగతికి అనుసరించాల్సిన వ్యూహం రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

27. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ కమిషన్ యాక్టు -1988కు సవరణలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

28. రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

29. తెలంగాణలో పెటర్నరీ యూనివర్సిటీ ప్రారంభించి, దానికి మాజీ ప్రధాని పివి నరసింహారావు పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

30. దేవాలయాల కమిటీలు మరింత ప్రభావవంతంగా పనిచేసేందుకు అవసరమైన మార్పులు తెస్తూ, మార్గదర్శకాలు రూపొందించాలని, ఈ విషయంలో ఆర్డినెన్స్ తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

31. శిక్షణ పూర్తి చేసుకున్న ఆర్ఎంపి, పిఎంపిలకు ప్రభుత్వ పరంగా సర్టిఫికెట్ ఇవ్వాలని, శిక్షణ తీసుకోని వారికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

32. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

33. రూ.6.50 కోట్ల చేనేత రుణాలను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

34. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు -2014లోని 9వ షెడ్యూల్ లో పొందుపరిచిన 89 ఉమ్మడి కార్పోరేషన్లను విభజించాలని, తెలంగాణకోసం ప్రత్యేక కార్పోరేషన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

35. తెలంగాణ శాసన మండలిలో ఖాళీ ఉన్న ఒక సీటుకు నల్గొండకు చెందిన కర్నె ప్రభాకర్ తో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

36. తెలంగాణ శాసనసభలో ఆంగ్లో ఇండియన్లకు కేటాయించిన నామినేటెడ్ ఎమ్మెల్యేగా రాయిడిన్ రోజ్ ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

37. నగరంలో పోలీసు వ్యవస్థను క్రమబద్దీకరించాలని, 3883 వాహనాల కొనుగోలుకు రూ.340 కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 3620 మంది కానిస్టేబుళ్లు, డ్రైవర్ల నియామకానికి కూడా ప్రభుత్వం అమోదం తెలిపింది.

38. పోలీస్ శాఖలో సూపర్ న్యూమరీ పోస్టులు ఏర్పాటు చేయాలని, ఇటీవల డిఎస్పీ స్థాయి నుంచి సిఐ స్థాయికి మారిన 134 మందిని మళ్లీ డిఎస్పీ స్థాయిలోనే ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

39. తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ గా కె. రామకృష్ణారెడ్డిని నియమించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

40. కొన్ని చిన్న మార్పులతో ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ అండ్ లైవ్ స్టాక్ మార్కెట్స్ యాక్టు -1996ను, రూల్సు-1969ను తెలంగాణలోనూ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

41. ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ప్రొడ్యూస్ అండ్ లైవ్ స్టాక్ మార్కెట్స్ యాక్టు-1966ను తెలంగాణలో అమలు పరుచుటకు ఆర్డినెన్స్ జారీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

42. తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

43. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బిజినెస్ రూల్స్ అండ్ సెక్రటరీయెట్ ఇన్ స్ట్రక్షన్స్ తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## *విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి గారు వెల్లడించిన మరికొన్ని ప్రభుత్వ విధానాలు*

1. ఎన్నికల మేనిఫెస్టోలో పేదలకు మూడు లక్షల రూపాయలతో ఇల్లు కట్టిస్తామని టిఆర్ఎస్ హామీ ఇచ్చింది. అయితే ఇప్పుడు అంచనా వ్యయం రూ.3.50 లక్షలకు పెరిగింది. లబ్దిదారులను గ్రామసభల ద్వారా పారదర్శకంగా ఎంపిక చేసి, 125 గజాల స్థలంలో రెండు బెడ్ రూములు, కిచెన్, హాలుతో పేదలకు ఇల్లు కట్టిస్తామని సిఎం వెల్లడించారు. గృహ నిర్మాణ పథకంలో అక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, అక్రమాలకు పాల్పడే వారిని జైలులో పెడతామని, సోషల్ ఆడిట్ చేయిస్తామని సిఎం చెప్పారు.
2. హైదరాబాద్ నగరంలో 2వేల ఎకరాల స్థలాన్ని సేకరించి డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తామని, రసాయన వ్యర్థ పదార్థాల వల్ల అనర్థాలు జరగకుండా చూస్తామని సిఎం వెల్లడించారు.
3. బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్రంతో పోరాడతామని, పార్లమెంటులో టిఆర్ఎస్ ఎంపీలు వత్తిడి తెస్తారని ముఖ్యమంత్రి చెప్పారు.

4. ప్రస్తుతమున్న భూదాన్ బోర్డును రద్దు చేసి, తెలంగాణ భూదాన్ బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు.

5. తెలంగాణలో కమతాల ఏకీకరణ కోసం 'రద్దు, బదలు' పథకం అమలు చేస్తామని చెప్పారు.

6. హైదరాబాద్ ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని, నగరాన్ని క్రమబద్దీకరిస్తామని చెప్పారు.

7. హైదరాబాద్ నగరంలో అక్రమాలను సహించేది లేదని, భూ కబ్జాదారుల పట్ల, పేకాట క్లబ్బుల నిర్వహణ పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. నగరంలో ప్రతీ ఇంచుపై నిఘా పెట్టేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని, శాంతి భద్రతలను కఠినంగా అమలు చేస్తామని చెప్పారు.

8. తెలంగాణ ప్రెస్ అకాడమీకి సీనియర్ జర్నలిస్టు అల్లం నారాయణను అధ్యక్షుడిగా వేసామని, అకాడమీని మరింత పటిష్ట పరుస్తామని చెప్పారు. హైదరాబాద్ నగరంలో జర్నలిస్టుల కోసం దేశంలోనే అత్యంత గొప్పగా తెలంగాణ జర్నలిస్టు భవన్ నిర్మిస్తామని సిఎం చెప్పారు.

9. హైదరాబాద్ శాంతిభద్రతల పర్యవేక్షణ అధికారాన్ని గవర్నర్ కు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని, అవసరమైతే ఈ

విషయంలో ఎంతవరకైనా పోరాడుతానని చెప్పారు. దేశవ్యాప్తంగా సిఎంలతో సమావేశం నిర్వహిస్తానని వెల్లడించారు.

10. గత ప్రభుత్వం అమలు చేసిన ఫీజ్ రీ ఎంబర్స్ మెంటు పథకం తెలంగాణలో ఉండదని, కేవలం ఫాస్ట్ మాత్రమే ఉంటుందని చెప్పారు.

11. తెలంగాణలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

12. ఎమ్సెట్ అడ్మీషన్ల గడువున అక్టోబర్ నెలాఖరు వరకు పొడిగించాలని సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరుఫున పిటిషన్ దాఖలు చేసినట్లు సిఎం తెలిపారు.

13. ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబుతో పాటు, పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులందరితోనూ సత్సంబంధాలుండే విధంగానే తమ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఇరుగు పొరుగు వారితో విజ్ఞతతో వ్యవహరిస్తామని వెల్లడించారు.